సాక్షి సూర్యాపేట

గురువారం । 13 । ఫిబ్రవరి । 2025



వైభవంగా పూర్ణాహుతి

యాదగిరిగుట్టలోని పూర్వగిరీశుడి బ్రహ్మోత్సవాల్లో బుధవారం పూర్ణాహుతిని వైభవంగా నిర్వహించారు. - 8లో



అనుమతించొద్దు

బర్డ్‌ఫ్లూ విస్తరిస్తున్నందున కోళ్ల వాహనాలు అనుమతించొద్దని జిల్లా పశువైద్యాధికారి శ్రీనివాసరావు అన్నారు. - 8లో



న్యాయం చేయాలి

ప్రభుత్వ ఉపాధ్యాయురాలు జబీనాబేగం కుటుంబానికి న్యాయం చేయాలని మోత్కూరులో ధర్నా చేశారు. - 8లో

న్యూస్‌రీల్

ఉపసంహరణకు నేడు ఆఖరు

నల్లగొండ : వరంగల్ – ఖమ్మం – నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నామినేషన్ల ఉపసంహరణకు ఈ నెల 13న గురువారం మధ్యాహ్నం 3 గంటల వరకు అవకాశం ఉంది. మొత్తం 23 మంది నామినేషన్లు సమర్పించగా ఒక నామినేషన్ తిరస్కరణకు గురైంది. 22 మంది అభ్యర్థుల నామినేషన్లను ఆమోదించారు. గురువారం నామినేషన్ల ఉపసంహరణ అనంతరం పోటీలో ఉండే అభ్యర్థులను ప్రకటించనున్నారు.

ఎంజీయూ అడిషనల్ కంట్రోలర్‌గా రామచందర్

నల్లగొండ టూటౌన్ : మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం పరీక్షల విభాగంలో అసిస్టెంట్ కంట్రోలర్‌గా డాక్టర్ ఎం.రామచందర్‌గౌడ్, కాంపిటీటివ్ ఎగ్జామ్ కోచింగ్ సెంటర్ కోఆర్డినేటర్‌గా సోషల్ వర్క్ విభాగ అధిపతి డాక్టర్ ఎస్.శ్రవణ్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు రిజిస్ట్రార్ అల్వాల రవి ఉత్తర్వులు జారీ చేశారు. వీరు ఒక ఏడాది పాటు ఆ బాధ్యతల్లో కొనసాగుతారు.

విద్యారంగాన్ని పట్టించుకోని ప్రభుత్వం



మాట్లాడుతున్న ఎర్ర అఖిల్‌కుమార్

భానుపురి (సూర్యాపేట): తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగాన్ని పట్టించుకోకుండా గాలికి వదిలేసిందని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్ర అఖిల్ కుమార్ విమర్శించారు. బుధవారం సూర్యాపేటలోని ఆ సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో విద్యాశాఖకు మంత్రి లేకపోవడంతో విద్యారంగం పరిస్థితి అస్తవ్యస్తంగా మారిపోయిందన్నారు. ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి కేటాయించిన బడ్జెట్.. విద్యాసంస్థల నిర్వహణకు, ఉద్యోగుల జీతభత్యాలకు కూడా సరిపోని స్థితి ఉందన్నారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు మాతంగి విజయ్, వంటికొమ్ము నగేష్, సాయి కిరణ్, నితిన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ అడ్మిషన్లకు నోటిఫికేషన్

రామగిరి(నల్లగొండ): ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ప్రొఫెసర్ జి.రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్‌లో వివిధ కోర్సుల్లో అడ్మిషన్లకు నోటిఫికేషన్ విడుదలైనట్లు ఎన్జీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్, కోఆర్డినేటర్ డాక్టర్ వెల్దండి శ్రీధర్ తెలిపారు. పీజీ, యూజీ, డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సులతో కలిపి 72 కోర్సులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఓయూసీడీఈ వెబ్‌సైట్ నందు వివరాలు పొందుపర్చినట్లు చెప్పారు. మార్చి 31వ తేదీలోపు ఆన్‌లైన్ నందు ఫీజు చెల్లించి ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 98669 77741, 93986 73736ను సంప్రదించాలని పేర్కొన్నారు.

'స్థానిక' పోరులో కాంగ్రెస్‌తో కలిసి పనిచేస్తాం



మాట్లాడుతున్న బెజవాడ వెంకటేశ్వర్లు

చిలుకూరు: త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తాము అధికార కాంగ్రెస్ పార్టీతో కలిసి పనిచేస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం చిలుకూరు మండల కేంద్రంలోని సీపీఐ భవన్‌లో జరిగిన పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో రిజర్వేషన్లు ఎలా వచ్చినా కాంగ్రెస్‌తోనే పొత్తుకు పార్టీ నిర్ణయం తీసుకున్నట్లుగా పేర్కొన్నారు. మండల స్థాయిలో గతంలో మాదిరిగా జెడ్పీటీసీ స్థానాన్ని సీపీఐకు కేటాయించాలని కోరారు. అలా కాకుంటే ఎంపీపీ, జెడ్పీటీసీలలో ఏ ఒక్కటి ఇచ్చినా తీసుకుంటామన్నారు. అలాగే సర్పంచ్ స్థానాల్లో సీపీఐకి మండల కేంద్రం చిలుకూరుతోపాటు నారాయణపురం, జెర్రిపోతులగూడెం, కొమ్ము బండతండా, సీతారాంపురం గ్రామాలు, అలాగే ఎంపీటీసీ స్థానాలు చిలుకూరులో రెండు, జెర్రిపోతులగూడెం, నారాయణపురం, బేతవోలులో ఒకటి చొప్పున అయిదు స్థానాలు సీపీఐకు కేటాయించాలని అన్నారు. సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి మండవ వెంకటేశ్వర్లు, గ్రామ శాఖ కార్యదర్శులు సాహెబ్ అలీ, చిలువేరు ఆంజనేయులు, నాయకులు చేపూరి కొండలు, కొడారు శ్రీను, కనకయ్య, నాగేశ్వరరావు, సుల్తాన్ వెంకటేశ్వర్లు, కట్టెకోల నాగేశ్వరరావు, మాదవరపు లక్ష్మయ్య పాల్గొన్నారు.

ఇక నుంచి మీ సేవలోనే

కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తుల స్వీకరణకు మరో అవకాశం

- పౌర సరఫరాల శాఖ నిర్ణయం
- కొనసాగుతున్న ఆన్‌లైన్ ప్రక్రియ
- ఇప్పటి వరకు చేసుకోని వారికి చాన్స్



రేషన్ కార్డుల కోసం వచ్చిన దరఖాస్తులు

ప్రజా పాలనలో	28,000
గ్రామ సభల్లో	23,798
మొత్తం	51,798

తిరుమలగిరి (తుంగతుర్తి): రేషన్ కార్డుల కోసం కొత్తగా దరఖాస్తులు స్వీకరించడానికి పౌర సరఫరాల శాఖ మరో అవకాశం కల్పించింది. ఇందుకోసం ఇక నుంచి మీ సేవ వెబ్‌సైట్‌లో దరఖాస్తుల స్వీకరిస్తారు. దీంట్లో భాగంగా దరఖాస్తుల స్వీకరణకు అధికారులు వెబ్‌సైట్‌లో ఆప్షన్‌ను పునఃరుద్ధరించారు. దీంతో ఐదు రోజులుగా దరఖాస్తుల స్వీకరణపై నెలకొన్న గందరగోళానికి తెరపడడంతో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ సోమవారం సాయంత్రం నుంచి మొదలైంది. అయితే రేషన్ కార్డుల కోసం ప్రజా పాలన కార్యక్రమం, కుల గణన లేదా ప్రజావాణిలో దరఖాస్తులు చేసుకున్న వారు మళ్లీ ఇప్పుడు దరఖాస్తు పెట్టుకునే అవసరం లేదని అధికారులు చెబుతున్నారు. కొత్త కార్డు, చిరునామా మార్పు, కొత్తగా కుటుంబ సభ్యులను చేర్చడం వంటి వాటికి అవకాశం కల్పించారు. అయితే ఆధార్ కార్డు ద్వారా కొత్త రేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచిస్తున్నారు.

గతంలో దరఖాస్తు చేసుకోని వారికి..

ప్రజా పాలన కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తుల ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం జనవరిలో లబ్ధిదారుల ఎంపికకు గ్రామ సభలు నిర్వహించింది. వివిధ గ్రామాల్లో అధికారులు వెల్లడించిన జాబితాపై ప్రజల నుంచి వ్యతిరేకత వ్యక్తమైంది. జాబితాలో పేర్లు రాని వారు ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకోని వారికి మళ్లీ దరఖాస్తులు పెట్టుకునే అవకాశం ఇచ్చారు.

నిరీక్షణకు తెరపడేనా?

తెలంగాణ ఆవిర్భావం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా కొత్త రేషన్‌కార్డుల జారీ కోసం లక్షలాది మంది నిరీక్షిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక నూతన రేషన్ కార్డుల జారీ ప్రక్రియలో వేగం పుంజుకుంది. దీంతో పేదలలో ఆశలు చిగురించాయి. ప్రజా పాలన కార్యక్రమం ద్వారా దరఖాస్తులను అధికారులు అందించారు. వీటి ఆధారంగా అర్హుల జాబితాను అధికారులు రూపొందించి గ్రామ సభల్లో పెట్టారు. స్వీకరించిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ ప్రక్రియ ముగిసిన తర్వాత అర్హులు ఎవరని తేల్చనున్నారు.

గతంలో చేయనివారే దరఖాస్తు చేసుకోవాలి



తిరుమలగిరిలో మీ సేవ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఈడీఎం గఫార్

తిరుమలగిరి, అర్వపల్లి: కొత్త రేషన్‌కార్డులకు గతంలో చేయనివారు మాత్రమే మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని మీసేవ కేంద్రాల జిల్లా మేనేజర్ (ఈడీఎం) గఫార్ కోరారు. తిరుమలగిరి, అర్వపల్లిలోని మీసేవ కేంద్రాలను బుధవారం ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. కొత్త రేషన్‌కార్డుకు ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకోనివారు మాత్రమే మీసేవ కేంద్రాల్లో చేయాలని, అలాగే కార్డు ఉండి కుటుంబ సభ్యులందరి పేర్లు లేనివారు తమ పేర్లను నమోదు చేసుకోవచ్చన్నారు. మీసేవ కేంద్రాల నిర్వాహకులు ప్రభుత్వం నిర్ణయించిన ధరను మాత్రమే తీసుకోవాలని, అదనంగా వసూళ్లు చేయవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో మీసేవ కేంద్రాల యజమానులు గన్నె సత్యనారాయణ, దావుల మల్లిఖార్జున్, సైదులు, వెంకన్న, సాయి, జ్యోతి పాల్గొన్నారు.

వైభవంగా సుదర్శన హోమం



హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

చివ్వెంల: మండలంలోని ఉండ్రుగొండ గ్రామ శివారులో గల గిరిదుర్గంలో వెలిసిన శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో మాఘ పౌర్ణిమ సందర్భంగా బుధవారం శ్రీసుదర్శన లక్ష్మీనరసింహ హోమం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు ఆరుట్ల రవికుమారాచార్యులు, కృష్ణమాచార్యుల మంత్రోచ్ఛరణల నడుమ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. హోమంలో 15 మంది దంపతులు కూర్చున్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు చకిలం కృష్ణకుమార్, డాక్టర్ ఎ.రామయ్య, మురళీకృష్ణ, బందకవి కృష్ణమోహన్, బొబ్బిలి శ్రీనివాస్‌రెడ్డి, గోపాల్ కిషన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా ఎదుర్కోలు



ఎదుర్కోలు అనంతరం జరిగిన పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే సామేలు తదితరులు

- కొనసాగుతున్న శ్రీయోగానంద లక్ష్మీనరసింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు



ఉత్సవానికి హాజరైన జనం

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండలం అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి ఎదుర్కోలు కార్యక్రమాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టువస్త్రాలు, తలంబ్రాలను తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు సామ అభిషేక్‌రెడ్డి, దేవస్థాన ఉత్సవ కమిటీ చైర్మన్ ఇందుర్తి వెంకట్‌రెడ్డి తలపై పెట్టుకొని ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అనంతరం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ.5కోట్లతో ఆలయాన్ని అభివృద్ధి చేయనున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కుంట్ల సురేందర్ రెడ్డి, గుడిపెల్లి మధుకర్‌రెడ్డి, బీరవోలు విక్రమ్‌రెడ్డి, సుంకరి జనార్దన్, వేల్పుల రమేష్, బైరబోయిన మహరాజు, సైదులు, రామలింగయ్య, కనుకు శ్రీను, మాజీ జెడ్పీటీసీ అవిలయ్య, దాసరి సోమయ్య, ఈఓ శ్రీనివాస్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసమూర్తి, ధర్మకర్తలు అనిల్, కృష్ణమూర్తి, ప్రవీణ్, రేఖ, వెంకన్న, వెంకట్‌రెడ్డి, నిమ్మల కుమార్, నిద్ర సంపత్ తదితరులు పాల్గొన్నారు.

యుద్ధభేరి ధర్నాను జయప్రదం చేయాలి

సూర్యాపేట టౌన్: కేంద్ర ప్రభుత్వం ఏప్రిల్ ఒకటవ తేదీ నుంచి అమల్లోకి తీసుకురానున్న యూనిఫైడ్ పెన్షన్ స్కీంను నిరసిస్తూ మార్చి 2న హైదరాబాద్ ఇందిరా పార్క్ ధర్నా చౌక్‌లో నిర్వహించనున్న యుద్ధభేరి ధర్నాను జయప్రదం చేయాలని తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు లక్కపాక ప్రవీణ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ ధర్నాకు జిల్లా నుంచి సీపీఎస్ ఉద్యోగులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

2వేల మందితో భారీ బందోబస్త్



జాతర ఏర్పాట్లపై పోలీస్ అధికారులతో చర్చిస్తున్న ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్

పెద్దగట్టు జాతరకు పటిష్ట భద్రత

- 68 సీసీ కెమెరాలతో ప్రత్యేక నిఘా
- ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ వెల్లడి

చివ్వెంల: మండలంలో దురాజ్‌పల్లి గ్రామంలో గల శ్రీలింగమంతుల స్వామి(పెద్దగట్టు) జాతరకు పటిష్ట భద్రత కల్పిస్తున్నామని, ఇందుకు 2వేల మంది పోలీస్ సిబ్బందితో భారీ బందోబస్త్ ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. ఈనెల 16 నుంచి 20వ తేదీ వరకు జరగనున్న జాతర నేపథ్యంలో బుధవారం ఆయన పెద్దగట్టు పరిసరాలను కలియదిరిగి బందోబస్త్ ఏర్పాట్లు, జాతర రూట్ మ్యాప్, గ్లోబల్ మ్యాప్‌లను పరిశీలించారు. పార్కింగ్ ప్రదేశాలు, సిబ్బంది వసతి, జాతరకు వచ్చి పోయే మార్గాలు, బారికేడ్ల ఏర్పాట్లు, దేవస్థానం రక్షణ చర్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతరకు వచ్చిపోయే వాహనాల వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జాతీయ రహదారి–65పై వాహనాల మళ్లింపు ఉంటుందన్నారు. హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్లే వాహనాలను నార్కట్‌పల్లి, నల్లగొండ, మిర్యాలగూడ, హుజూర్‌నగర్, కోదాడ మీదుగా మళ్లిస్తామన్నారు. అదేవిధంగా విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలను కోదాడ, హుజూర్‌నగర్, నల్లగొండ, నార్కట్‌పల్లి మీదుగా మళ్లిస్తామని పేర్కొన్నారు. ఇతర జిల్లాల ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భక్తులకు దైవదర్శనం కల్పించేలా పోలీస్ సేవలను కూడా వినియోగించుకుంటున్నామన్నారు. జాతరలో 68 సీసీ కెమెరాలతో నిఘా ఉంచామన్నారు. కమాండ్ అండ్ కంట్రోల్ రూమ్‌కు అటాచ్ చేసి 24 గంటల పర్యవేక్షణ చేస్తామన్నారు. దొంగతనాలు జరగకుండా పోలీస్ స్పెషల్ టీమ్స్, క్రైమ్ కంట్రోల్ టీమ్స్ ఏర్పాటు చేశామన్నారు. ప్రత్యేక టీమ్ మఫ్టీలో తిప్పుతూ అనుమానితులను గుర్తించి, దొంగతనాలు జరగకుండా చూస్తామన్నారు. మహిళల భద్రత కోసం షీటీమ్ ఉంటుందని, సాధారణ భక్తుల్లాగా ప్రజల్లో కలిసిపోయి షీటీమ్ బృందం పనిచేయనుందన్నారు. జాతర ప్రదేశంలో పోలీస్ కంట్రోల్ రూమ్, హెల్ప్‌లైన్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నామని, అత్యవసర సమయంలో పోలీస్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చెరువు నిండుగా ఉన్నందున చెరువు వైపు ఎవరు వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటు చేశామని, పిల్లలు, వృద్ధుల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ నాగేశ్వర్‌రావు, డీఎస్పీ రవి, ఎస్బీ సీఐ నాగభూషణం, సీఐలు రాజశేఖర్, శ్రీను, రఘువీర్, వీరరాఘవులు, ఎస్‌ఐలు మహేశ్వర్, సాయిరామ్ శ్రీకాంత్, బాలు నాయక్, వీరయ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీని అభినందించిన డీజీపీ



ఎస్పీని అభినందిస్తున్న డీజీపీ డాక్టర్ జితేందర్

సూర్యాపేట టౌన్: కరీంనగర్‌లో ఇటీవల జరిగిన తెలంగాణ రాష్ట్ర స్థాయి 3వ పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌లో టేబుల్ టెన్నిస్ విభాగంలో జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ పాల్గొని బ్రాంజ్ మెడల్ గెలుపొందారు. ఈ సందర్భంగా రాష్ట్ర డీజీపీ డాక్టర్ జితేందర్ బుధవారం హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో మెడల్, ప్రశంసా పత్రం అందించి అభినందించారు. అలాగే ఇదే స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌లో 5వ జోన్ తరఫున జిల్లా నుంచి పాల్గొని కబడ్డీ, వాలీబాల్ పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచి వెండి పతకాలు పొందిన మహిళా జట్ల క్రీడాకారులను బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ నాగేశ్వరరావు, ఏఆర్ డీఎస్పీ నరసింహాచారి, సిబ్బంది ఉన్నారు.



క్రీడాకారులను అభినందిస్తున్న ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

మట్టపల్లి నారసింహుడికి విశేష పూజలు



స్వామివారి గరుడవాహన సేవలో పాల్గొన్న భక్తులు, అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి దేవాలయంలో బుధవారం శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారికి విశేష పూజలు కొనసాగాయి. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యహోమం, మూలవారాట్‌కు పంచామృతాభిషేకం చేపట్టారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టువస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోలు మహోత్సవం జరిపారు. ఆ తర్వాత విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, ఋత్విగ్వరణం, మధుపర్కపూజ, మాంగళ్యధారణ, తలంబ్రాలతో నిత్యకల్యాణం వైభవంగా నిర్వహించారు. చివరగా శ్రీస్వామి అమ్మవార్లను గరుడవాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు అద్దేపల్లి లక్ష్మణాచార్యులు, పద్మనాభాచార్యులు, ఫణిభూషణ మంగాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శేషగిరిరావు, భక్తులు పాల్గొన్నారు.



బడి బయట పిల్లలు 228 మంది

- గత నెలలో నిర్వహించిన సర్వేలో గుర్తించిన సీఆర్పీలు
- వివరాలు ప్రత్యేక యాప్‌లో నమోదు
- పాఠశాలల్లో చేర్పించేందుకు విద్యాశాఖ ఏర్పాట్లు

ప్రభుత్వ పాఠశాలలు	పాఠశాల కాంప్లెక్స్‌లు	సర్వేలో పాల్గొన్న సీఆర్పీలు	గతేడాది గుర్తించిన బడి బయట పిల్లల సంఖ్య	ఈ ఏడాది గుర్తించిన పిల్లలు
967	64	77	145	228

నాగారం : పాఠశాలకు వెళ్లని, బడి మధ్యలోనే మానేసిన పిల్లలు జిల్లాలో 228 మంది ఉన్నట్లు తేలింది. వివిధ కారణాలతో చదువుకు దూరమైన వీరిని బడుల్లో చేర్పించనున్నారు. గతనెల 12 నుంచి 31 వరకు విద్యాశాఖ ఆధ్వర్యంలో సీఆర్పీలు క్షేత్రస్థాయిలో బడి బయట పిల్లల గుర్తింపు కార్యక్రమం నిర్వహించారు. పాఠశాలకు వెళ్లని పిల్లల వివరాలు సేకరించి, కారణాలు అడిగి తెలుసుకున్నారు. వీరందరినీ సమీప పాఠశాలల్లో చేర్పించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఇటుక బట్టీల్లోని కార్మికుల పిల్లల కోసం సైతం విద్యాశాఖ ప్రత్యేక బడులు ఏర్పాటు చేస్తోంది. బట్టీల యజమానుల సహకారంతో పుస్తకాలు తదితర సామగ్రి పంపిణీ చేస్తూ పాఠాలు బోధిస్తున్నారు.

ఆన్‌లైన్‌లో నమోదు

సీఆర్పీలు పాఠశాలల్లోని విలేజ్ లెవల్ రిజిష్టర్ ఆధారంగా బడీడు పిల్లల ఇళ్లకు వెళ్లి, 6–14 ఏళ్ల, 15 నుంచి 19 సంవత్సరాల వయస్సు ఉన్న వారి వివరాలను ఆరా తీశారు. మధ్యలో బడి మానేశారా? ఆర్థిక ఇబ్బందులున్నాయా? పనులకు వెళ్తున్నారా? అనే కోణంలో వివరాలు సేకరించారు. 228 మంది పాఠశాలకు వెళ్లని పిల్లలను గుర్తించారు. తల్లిదండ్రులకు వ్యవసాయ పనుల్లో సహకరించడం, కుటుంబ ఆర్థిక పరిస్థితులు బాగా లేకపోవడం తదితర కారణాలతో బడికి వెళ్లని వారే అధికంగా ఉన్నారు. వీరి వివరాలు ప్రబంధ్ పోర్టల్‌లో నమోదు చేస్తున్నారు.

వలస కార్మికుల పిల్లలకు బడులు ఏర్పాటు

బడి బయట పిల్లలను గుర్తించేందుకు మొదటగా క్లస్టర్ పరిధిలో పనిచేస్తున్న సీఆర్పీలు మండలాల్లోని గ్రామాలు, ఆవాస ప్రాంతాల్లో ఇంటింటి సర్వే నిర్వహించారు. జిల్లాలోని ఇటుకబట్టీల్లో 41 మంది బడీడు పిల్లలను గుర్తించారు. వీరికోసం స్థానికంగానే ప్రత్యేక బడులు ఏర్పాటు చేశారు. విద్యార్హతలు ఉన్న వారిని గుర్తించి వారిని వలంటీర్లుగా నియమించి బోధన చేయిస్తున్నారు. అలాగే విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, పలకలు తదితర సామగ్రిని బట్టీల నిర్వాహకులు, అధికారులు సమకూర్చుతున్నారు.

బడి బయట ఉన్న పిల్లల ఇళ్లకు వెళ్లి..

విద్యాశాఖ చట్టం ప్రకారం బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి. అయితే గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో చాలా మంది పేదరికంతో విద్యకు దూరమవుతున్నారు. చదువుకోవాలని ఉన్నా పాఠశాలకు వెళ్లలేని పరిస్థితులు ఉన్నాయి. బడి బయట ఉన్న పిల్లల ఇళ్లకు వెళ్లి వాస్తవ పరిస్థితులు సీఆర్పీలు తెలుసుకున్నారు. తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించి వారిని పాఠశాలల్లో చేర్పించేందుకు ప్రయత్నిస్తున్నారు. అనాథ పిల్లలను కస్తూర్బా, గురుకులాల్లో చదువుకునేలా ప్రోత్సహిస్తున్నారు.

ప్రతి ఒక్కరికీ విద్య అందించేలా చర్యలు



జిల్లాలో బడి బయట ఉన్న పిల్లలను గుర్తించాం. తల్లిదండ్రుల సహకారంతో వారిని తిరిగి పాఠశాలల్లో చేర్పిస్తున్నాం. వలస కార్మికుల పిల్లలకు స్థానికంగా విద్యనందించే ఏర్పాటు చేశాం. ప్రతి ఒక్కరికీ విద్య అందించేలా చర్యలు తీసుకుంటున్నాం.

– దేవరశెట్టి జనార్దన్, కోఆర్డినేటర్ ఫర్ అవుటాఫ్ స్కూల్ చిల్డ్రన్, సూర్యాపేట

77 మంది సీఆర్పీలు

జిల్లాలోని 23 మండలాలలో 64 క్లస్టర్లు ఉండగా వీటి పరిధిలో 77 మంది సీఆర్పీలు పనిస్తున్నారు. వీరందరూ క్షేత్రస్థాయిలో బడి బయట పిల్లల సర్వే చేపట్టారు. జిల్లాలో 6 నుంచి 14 ఏళ్ల వారు 125 మంది, 15 నుంచి 19 ఏళ్ల వారు 28 మంది, వలస వచ్చిన వారు 41, వలస వెళ్లిన వారు 30, దివ్యాంగులు నలుగురు.. ఇలా జిల్లా వ్యాప్తంగా బడి బయట పిల్లలు 228 మందిని గుర్తించారు.

క్లుప్తంగా

యువకుడి అదృశ్యం


బొంత హరికృష్ణ

రామన్నపేట : మండలంలోని జనంపల్లి గ్రామానికి చెందిన యువకుడు అదృశ్యమయ్యాడు. సంఘటనకు సంబంధించిన వివరాలు.. గ్రామానికి చెందిన బొంత సరస్వతి కుమారుడు హరికృష్ణ ఈ నెల 8న సాయంత్రం దుకాణానికి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతడి కోసం వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. వాట్సాప్ స్టేటస్, ఇన్‌స్టాగామ్‌లలో ఇంటి వద్ద ఉంటే గుండెపోటు వచ్చేలా ఉందని, అప్పులు అయ్యాయని మెస్సేజ్ పెట్టి ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. బుధవారం తల్లి సరస్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ పి.మల్లయ్య తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలు మృతి

ఆలేరురూరల్ : ఆలేరు మున్సిపాలిటీలోని 11వ వార్డులో అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలు మృతి చెందింది. ఈ సంఘటన బుధవారం సాయంత్రం ఐదు గంటల ప్రాంతంలో చోటుచేసుకుంది. ఆలేరు పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మున్సిపాలిటీకి చెందిన తునికి మణెమ్మ(80) తన కొడుకు రామారావు కుటుంబ సభ్యులతో కలిసి జీవిస్తోంది. కుటుంబ సభ్యులు ఇంట్లో వెనక గదితో, మృతురాలు మణెమ్మ ఇంటి ముందు గదిలో ఉంటున్నారు. ఈ క్రమంలో బుధవారం ఆమె ముందు గదిలో నిద్రిస్తోంది. స్థానికులు పలకరించడానికి రాగా మణెమ్మ విగతజీవిగా పడి ఉంది. స్థానికులు వెంటనే 100కు సమాచారం అందించడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. అయితే మృతిరాలి మెడలోని రెండు తులాల బంగారు పుస్తెలతాడు, ఆమె వద్ద ఉన్న కొంత పెన్షన్ నగదు కనిపించకపోవడంతో ఎవరైనా హత్య చేసి ఉంటారేమోనని పోలీసులు అనుమానిస్తున్నారు. అక్కడ ఉన్న సీసీ కెమెరాల ఆధారంగా ఇంట్లోకి బంధువుల్లో ఒకరు వచ్చి వెళ్లి ఉంటారని తెలుస్తోంది. మణెమ్మ మృతిపై అనుమానాలు ఉన్నట్లు పోలీసులు భావిస్తున్నారు. క్లూస్‌టీంతో సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. మృతిరాలి కొడుకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ రజనీకర్ తెలిపారు.

లారీ బోల్తా.. ముగ్గురికి గాయాలు

పెన్‌పహాడ్ : సిమెంట్ కంకర మిక్సింగ్ లారీ బోల్తాపడి ముగ్గురికి గాయాలైన సంఘటన పెన్‌పహాడ్ మండల పరిధిలోని సింగారెడ్డిపాలెం గ్రామ శివారులోని మూలమలుపు వద్ద బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట నుంచి సిమెంట్ కంకర మిక్సింగ్ లోడ్‌తో గరిడేపల్లి వైపు వెళ్తుండగా ప్రమాదశాత్తు లారీ బోల్తా పండింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ ముర్మెకునుతోపాటు అందులో ప్రయాణిస్తున్న జక్కి శ్రీనయ్య, మల్లిలకు గాయాలయ్యాయి. స్థానికులు వీరిని 108 వాహనంలో చికిత్స నిమిత్తం సూర్యాపేట ఆస్పత్రికి తరలించారు.

జాతీయ స్థాయి హాకీ పోటీలకు ఎంపిక


సునీల్‌కుమార్

గుర్రంపోడు : ఆల్ ఇండియా సివిల్ సర్వీస్ హాకీ టోర్నమెంట్ తెలంగాణ రాష్ట్ర జట్టుకు గుర్రంపోడు మండలం పిట్టలగూడెం గ్రామ జెడ్పీ ఉన్నత పాఠశాల గణిత స్కూల్ అసిస్టెంట్ అద్దంకి సునీల్‌కుమార్ ఎంపికయ్యారు. ఈ నెల 13 నుంచి మార్చి ఒకటో తేదీ వరకు ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడలో జరిగే జాతీయ స్థాయి హాకీ పోటీల్లో సునీల్‌కుమార్ తెలంగాణ రాష్ట్ర జట్టు తరపున ఆడనున్నారు. గత నెలలో హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి హాకీ టోర్నమెంట్‌లో సునీల్‌కుమార్ ప్రతిభ కనబరిచి రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారు. రాష్ట్రం నుంచి ఎంపికైన 18 మంది ఉద్యోగుల్లో సునీల్‌కుమార్ ఒకరు. అద్దంకి సునీల్‌కుమార్ ఎంపికపై పాఠశాల హెచ్‌ఎం నకిరెకంటి యాదయ్య, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

పూర్వగిరిలో వైభవంగా పూర్ణాహుతి

- తరలివచ్చిన భక్తులు
- ఉదయం పూర్ణాహుతి.. రాత్రి దేవతోద్వాసన
- నేడు శతఘటాభిషేకంతో ఉత్సవాల ముగింపు


దేవతలకు ఉద్వాసన పలికే వేడుక నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: పూర్వగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి(పాతగుట్ట) వారి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం ఉదయం నిత్యారాధనల అనంతరం పారాయణీకులతో చతుర్వేద పారాయణం, యాజ్ఞీకులతో నిత్య హవనం, మూలమంత్ర, మూర్తి మంత్ర జపములు నిర్వహించారు. ఉదయం 9గంటలకు పూర్ణాహుతి మహోత్సవం పాంచరాత్ర ఆగమ రీత్యా అత్యంత వైభవంగా జరిపించారు. బ్రహ్మోత్సవాలకు విచ్చేసిన దేవకోటికి కృతజ్ఞతాపూర్వకంగా నిత్య హవనముల ద్వారా హవిస్సులు సమర్పించి, అనుగ్రహం పొందేందుకు ప్రార్థించారు. అనంతరం మధ్యాహ్నం 12గంటలకు చక్రతీర్థ మహోత్సవం ఆలయ పుష్కరిణిలో ఆలయ ప్రధానార్చకులు, యాజ్ఞీకులు, అర్చక బృందం, పారాయణీకులు అత్యంత వైభవంగా జరిపించారు. ఈ వేడుకల్లో ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు, అర్చకులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

చక్ర ఆళ్వారుడితో..

మహావిష్ణువు ఆయుధమైన శ్రీచక్ర ఆళ్వారుడికి బుధవారం ఉదయం 10.30 గంటలకు విశేషంగా పూజలు చేశారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా పూర్వగిరి ఆలయ వీధుల్లో ఊరేగించి, అనంతరం శ్రీచక్రాన్ని, శ్రీస్వామి వారి సేవను మధ్యాహ్నం 12 గంటలకు మెట్ల మార్గంలో వెళ్లి ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఉన్న పుష్కరిణిలో శ్రీచక్రతీర్థ స్నానం నిర్వహించారు. ముందుగా శ్రీచక్ర ఆళ్వారుడిని అలంకరించి, ప్రత్యేక పల్లకిపై అధిష్ఠింపజేసి పూజలు చేశారు. ఈ వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పుష్కరిణిలో శ్రీచక్ర స్నానం చేసిన అనంతరం ఆ నీటిని తీసుకెళ్లడానికి భక్తులు పోటీ పడ్డారు. పలువురు భక్తులు పుష్కరిణిలోనే స్నానాలు చేశారు.

రాత్రి వేళ శ్రీపుష్పయాగం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారి ఆలయంలో రాత్రి నిత్య ఆరాధనల అనంతరం దేవతోద్వాసన, శ్రీపుష్పయాగం, డోలారోహణం వేడుకలను ప్రధానార్చకులు, ఉప ప్రధానార్చకులు, యజ్ఞాచార్యులు, పారాయణీకులతో జరిపించారు. అనంతనం ఉత్సవ నిర్వహణకు ఆహ్వానింపబడిన సకల దేవతలను ఈ దేవతోద్వాసన మంత్రముతో వారివారి స్థానాలకు భక్తి పూర్వకంగా వేంచేపు చేశారు. ఇక భగవానుడి ఆరాధించు ప్రక్రియల్లో భగవానుడికి అత్యంత ప్రీతి పాత్రమైన వేడుకగా పుష్పోత్సవం జరిపించారు. అనంతరం డోలోత్సవం వైభవంగా జరిపించారు. శ్రీస్వామి అమ్మవారిని వేంచేపు చేసి భక్తిభరిత కీర్తనలతో ఊయలను ఊపుతూ వేడుకను నిర్వహించారు.


పుష్కరిణికి శ్రీస్వామి వారి సేవను ఊరేగింపుగా తీసుకెళ్తున్న అర్చకులు

నేడు ఉత్సవాలు ముగింపు

పూర్వగిరి వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం ముగియనున్నాయి. ఉదయం 10గంటలకు శ్రీస్వామి వారి శతఘటాభిషేకం, మధ్యాహ్నం ఒంటి గంటకు మహదాశీర్వచనం, పండిత సన్మానంతో ఉత్సవాలను ఆచార్యులు, అధికారులు పరిసమాప్తం చేయనున్నారు.

అడ్డు తొలగించుకునేందుకే అసత్య ప్రచారం


వివరాలు వెల్లడిస్తున్న సంధ్య

శాలిగౌరారం: అదనపు కట్నం కోసం వేధింపులకు గురిచేసి, తనను ఇంటిలో నుంచి బయటకు వెళ్లగొట్టి, మరో మహిళతో సహజీవనం చేస్తూ.. తన అడ్డు తొలగించుకునేందుకు అసత్య ప్రచారం చేస్తున్న తనభర్త అయిన హైదరాబాద్‌లోని ఆబిడ్స్ సీఐ(డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్) కుంభం సైదులుపై పోలీసు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని సీఐ భార్య కుంభం సంధ్య కోరారు. మండలంలోని బండమీదిగూడెంలో తన తల్లిగారింటి వద్ద బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె తనగోడును వెల్లబోసుకున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలం వెల్దేవి గ్రామానికి చెందిన కుంభం నర్సింహతో తనకు 2012 ఏప్రిల్ 18న వివాహం జరిగిందన్నారు. వివాహ సమయంలో కట్నకానుకల కింద రూ.18.50 లక్షలు ఇవ్వడంతోపాటూ పది తులాల బంగారు ఆభరణాలను పెట్టారన్నారు. కొంత కాలం తర్వాత అదనపు కట్నం కోసం వేధింపులకు గురిచేయడం మొదలు పెట్టడంతో గ్రామపెద్దల సమక్షంలో పలుమార్లు పంచాయతీలు పెట్టి అదనంగా మరో రూ. 2 లక్షలు అప్పజెప్పారన్నారు. అంతటితో ఆగకుండా తన తల్లిదండ్రుల వ్యవసాయ భూమిలో భాగం తీసుకురావాలని వేధించడం మొదలుపెట్టారన్నారు. ప్రస్తుతం తమకు కుమార్తె(10), కుమారుడు(05) ఉన్నారన్నారు. తన భర్త వేధింపులు తట్టుకోలేక తన ఇద్దరు పిల్లలతో తన తల్లిగారింటి వద్ద ఉండడంతో తనపై పిల్లల కిడ్నాప్ కేసు పెట్టారని తెలిపారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్న తనభర్త సీఐ కుంభం నర్సింహపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై సీఐ నర్సింహను ఫోన్‌లో వివరణ కోరగా.. తన భార్యతో గొడవలు జరుగుతున్న విషయం వాస్తవమేనన్నారు. విడాకుల కోసం తాను కోర్టును ఆశ్రయించానని, కేసు కోర్టులో ఉండడంతో కోర్టు తీర్పు వచ్చిన తర్వాతే ఈ విషయంపై మాట్లాడతానన్నారు.

భూ భారతి చట్టంలో మార్పులు


మాట్లాడుతున్న సునిల్

చండూరు (గట్టుప్పల్) : భూ భారతి చట్టంలో అనేక మార్పులు తెచ్చామని భూ భారతి చట్టం రూపకల్పన కమిటీ సభ్యుడు భూమి సునిల్ పేర్కొన్నారు. నల్లగొండ జిల్లా గట్టుప్పల్ మండలం నామాపురం గ్రామంలో భూ భారతి, విత్తన, వ్యవసాయ చట్టాలపై లీఫ్స్, గ్రాస్ సుచింత సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత చట్టంలో తహసీల్దారు, ఆర్డీఓలకు పూర్తిస్థాయి అధికారాలున్నాయని తెలిపారు. భూ భారతి చట్టం ద్వారా సాదా బైనామాల అమలు వేగవంతం అవుతోందన్నారు. దేశంలోని అనేక రాష్ట్రాల్లో భూ చట్టాలను పరిశీలించి అధ్యయనం చేసి భూ భారతి చట్టానికి రూపకల్పన చేశామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ చట్టంపై అవగాహన కల్పించాలని నల్లగొండ జిల్లాలో లీఫ్స్, గ్రాస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నామాపురం గ్రామంలో ఈ కార్యక్రమాన్ని శ్రీకారం చుట్టామన్నారు. కార్యక్రమంలో తిరందాస్ ప్రవీణ్ కుమార్, తెలంగాణ సోషల్ మీడియా కన్వీనర్ కరుణాకర్ దేశాయ్, హైకోర్టు సీనియర్ న్యాయవాది జీవన్‌కుమార్, సునీల్, కంచుకట్ల సంపత్, సుభాష్, మహేశ్వరం సతీష్, లింగయ్య, ప్రకాష్, రామకృష్ణయ్య, యాదయ్య, శేఖర్, వెంకటేష్, రాములు, ధర్మయ్య, లచ్చయ్య, జంగయ్య పాల్గొన్నారు.

● స్వర్ణగిరి క్షేత్రంలో గరుడ వాహన సేవ


గరుడ వాహన సేవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు

భువనగిరి పట్టణ శివారులోని స్వర్ణగిరి క్షేత్రంలో గల శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో మాఘ పౌర్ణమి సందర్భంగా బుధవారం శ్రీ వారిని అలంకరించి మాడ వీధుల్లో గరుడ వాహనంపై తిరువీధి ఉత్సవ సేవ కార్యక్రమం నిర్వహించారు. అంతకు ముందు ఆలయంలో ఉదయం సుప్రభాత సేవ, సహస్ర నామార్చన, స్వామి వారి నిత్య కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆలయ ఆవరణలో నూతనంగా నిర్మించిన అన్నప్రసాద మండపాన్ని ఆలయ వ్యవస్థాపకుడు మానేపల్లి రామారావు ప్రారంభించారు. –భువనగిరి

20న ‘చలో హైదరాబాద్’

భానుపురి (సూర్యాపేట) : కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20వ తేదీన నిర్వహించనున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మందారి డేవిడ్‌కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక చంద్ర పుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో చలో హైదరాబాద్ వాల్ పోస్టర్‌ను పార్టీ నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించి మాట్లాడారు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు

పెన్‌పహాడ్ : వరిలో ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని కేవీకే శాస్త్రవేత్త నరేష్ అన్నారు. బుధవారం పెన్‌పహాడ్ మండల పరిధిలోని సింగారెడ్డిపాలెం గ్రామంలో ఐసీఎఆర్ భారతీయ వరి పరిశోధన సంస్థ రాజేంద్రనగర్ ఆధ్వర్యంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సీఎస్ఆర్ ఫండ్ సహకారంతో కేవీకే గడ్డిపల్లి శాస్త్రవేత్తలు వరిలో డ్రమ్ సీడర్, వెదజల్లే పద్ధతిలో డ్రోన్ ద్వారా కలుపు మందు పిచికారీపై రైతులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ వరి విత్తనాలను నేరుగా విత్తడం ద్వారా నీటి వినియోగం తగ్గించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు కిరణ్, ఆదర్శ్, వ్యవసాయ విద్యార్థులు, రైతులు మాధవరావు, సోమయ్య, రాములు, సైదులు పాల్గొన్నారు.

పెరిగిన బీర్ల ధరలు

భువనగిరిటౌన్ : ప్రభుత్వం అనూహ్యంగా బీర్ల ధరలను 15 శాతం పెంచుతూ నిర్ణయం తీసుకుంది. పెంచిన ధరలు ఈ నెల11 నుంచే అమలులో ఉంటాయని పేర్కొనడంతో మద్యం ప్రియులంతా షాక్‌కు గురయ్యారు. ప్రభుత్వం బీర్ల ధరలు పెంచడంపై మందుబాబులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. బీర్ల కంపెనీల ఒత్తిడికి ప్రభుత్వం తలొగ్గిందని మండిపడుతున్నారు. పెంచిన బీర్ల ధరల పట్టికను వైన్స్ షాపుల ఎదుట పెట్టాలని అధికారులు వైన్స్ షాపుల యాజమానులకు సూచించారు.

ధరల వివరాలు

	గతంలో	ప్రస్తుతం
కేఎఫ్ ప్రీమియం	రూ.150	రూ.180
కేఎఫ్ అల్ట్రా మ్యాక్స్	రూ.220	రూ.260
ఆర్‌సీ	రూ.150	రూ.180
హేవార్డ్స్ 5000	రూ. 160	రూ.190
నాకౌంట్	రూ.160	రూ.190
బడ్వైజర్ లైట్	రూ.210	రూ.250
బడ్వైజర్ మ్యాగ్నం	రూ.220	రూ.260
టూబర్గ్ స్ట్రాంగ్	రూ.240	రూ.276
కరోనా	రూ. 210	రూ.250

వివాదం నడుమ యువకుడి అంత్యక్రియలు

- ఈ నెల 8న రోడ్డు ప్రమాదం
- చికిత్స పొందుతూ 10వ తేదీన మృతి
- ఆస్తి వివాదం ముగిసిన అనంతరం బుధవారం అంత్యక్రియలు

చిట్యాల: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఓ యువకుడి అంత్యక్రియలు ఆస్తి వివాదంతో మూడు రోజులపాటు నిలిచిపోయిన సంఘటన ఆలస్యంగా చిట్యాల మండలం ఏపూరు గ్రామంలో వెలుగులోకి వచ్చింది. ఆ గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపూరు గ్రామానికి చెందిన కూరాకుల ధనుంజయ్(26) డీసీఎం ఓనర్ కమ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కాగా ఈ నెల 8వ తేదీన ఆ గ్రామ శివారులో బైక్‌పై వెళ్తూ ప్రమాదవశాత్తు అదుపుతప్పి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో అతడిని వైద్య చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఈ నెల 10వ తేదీన మృతి చెందాడు. అనంతరం మృతదేహాన్ని అంత్యక్రియలు చేసేందుకు స్వగ్రామానికి తీసుకొచ్చారు. అయితే వారి కుటుంబ సభ్యుల మధ్య ఆస్తి వివాదం నెలకొనడంతో అంత్యక్రియలు నిలిచిపోయాయి. మృతుడికి తల్లి నాంచారమ్మ, భార్య, ఇద్దరు చిన్న పిల్లలున్నారు. మృతుడు ధనుంజయ్ తల్లికి కొంత భూమి ఉండగా ఆ భూమిని అతడి కుటుంబానికి రిజిస్ట్రేషన్ చేయాలని మృతుడి భార్య తరఫున బంధువులు, గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఆ భూమి రిజిస్ట్రేషన్ చేయడానికి మృతుడి తల్లి నాంచారమ్మ ఒప్పుకోకపోవడంతో ఈ నెల 10వ తేదీ నుంచి ధనుంజయ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించుకుండా ఏపూరులోనే ఉంచారు. బుధవారం పెద్దల సమక్షంలో మృతుడి కుటుంబ సభ్యులకు భూమి రిజిస్ట్రేషన్ చేయడంతో వివాదం సద్దుమనిగింది. అనంతరం ధనుంజయ అంత్యక్రియలను బుధవారం సాయంత్రం ఏపూరులో పూర్తి చేశారు.

కోళ్ల వాహనాలను అనుమతించొద్దు

- సూర్యాపేట జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసరావు


కోళ్ల వాహనాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ శ్రీనివాసరావు

కోదాడరూరల్ : బర్డ్‌ఫ్లూ వైరస్ విస్తరిస్తున్నందున ఆంధ్రప్రదేశ్ వైపు నుంచి వస్తున్న కోళ్ల వాహనాలను మన రాష్ట్రంలోకి అనుమతించొద్దని జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసరావు అన్నారు. బుధవారం కోదాడ మండల పరిధిలోగల అంతర్రాష్ట్ర సరిహద్దులో పశువైద్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును ఆయన పరిశీలించి మాట్లాడారు. ఈ వైరస్ వ్యాప్తికి కోళ్లతోపాటు వాటిని రవాణా చేసే ఖాళీ వాహనాలు కూడా కారణం అవుతాయని అన్నారు. ఖాళీ వాహనాలను శానిటైజేషన్ చేసిన తర్వాతే రాష్ట్రంలోకి అనుమతించాలని సూచించారు. బర్డ్ ఫ్లూ సోకి చనిపోయిన కోళ్లను ఆరుబయట వేయొద్దని గుంత తీసి పూడ్చిపెట్టాలన్నారు. వికారాబాద్ నుంచి ఏపీలోని విజయవాడకు వెళ్తున్న కోళ్ల వ్యానును ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. విజయవాడ నుంచి మన రాష్ట్రంలోకి వస్తున్న ఓ ఖాళీ వాహనాన్ని వెనక్కి పంపించారు. కార్యక్రమంలో కోదాడ ప్రాంతీయ పశు వైద్యాధికారి డాక్టర్ పెంటయ్య, మండల పశువైద్యాధికారి డాక్టర్ మధు, సిబ్బంది ఉన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో ‘జయ’ విద్యార్థుల ప్రతిభ


శివమణి


ఉజ్వన్


హన్షితశ్రీ

సూర్యాపేటటౌన్ : జేఈఈ మెయిన్స్ -2025 ఫలితాల్లో జిల్లా కేంద్రంలోని జయ జూనియర్ కళాశాలకు చెందిన 13 మంది విద్యార్థులు ఆల్ ఇండియా స్థాయిలో 90, ఆపైన పర్సంటైల్స్ సాధించారని కళాశాల కరస్పాండెంట్ జయ వేణుగోపాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కె.ఉజ్వన్ 99.03, సీహెచ్.హన్షితశ్రీ 98.73, బి.శివమణి 98.74, టి.అమూల్య 96.97, పి.అమిత్‌సూర్య 96.88, బి.లాస్య 96.27, కె.సాయినందన్ 94.42, ఎం.సాద్విక 93.69, సీహెచ్.కుశల్‌రాజ్ 93.23, జి.సాయిరాం 92.69, ఎస్.నక్షత్ర 90.62 పర్సంటైల్‌తో పాటు 13 మంది విద్యార్థులు 90 ఆపై పర్సంటైల్ సాధించినట్లు పేర్కొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కరస్పాండెంట్ జయ వేణుగోపాల్, డైరెక్టర్లు జెల్లా పద్మ, బింగి జ్యోతి అభినందించారు.

టీచర్ కుటుంబానికి న్యాయం చేయాలి

మోత్కూరు : అడ్డగూడూరు మండలం చౌళ్లరామారం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలు జబీనాబేగం కుటుంబానికి తగిన న్యాయం చేయాలని కోరుతూ మోత్కూరులో పలువురు ధర్నా నిర్వహించారు. అదేవిధంగా మండలంలోని పాలడుగు, పాటిమట్ల గ్రామాల్లో ప్రధాన రహదారిపై విద్యార్థులు, గ్రామస్తులు, ఉపాధ్యాయులు, రాజకీయ పార్టీల నాయకులు భారీ ధర్నా నిర్వహించారు. మోత్కూరు మండలం దాచారం జెడ్పీహెచ్‌ఎస్‌లో ఇంగ్లిష్ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న జబీనాబేగం కాంప్లెక్స్ మీటింగ్ కోసం అడ్డగూడూరుకు స్కూటీపై వెళ్తుండగా మంగళవారం రోడ్డు పని చేస్తున్న వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. రోడ్డు కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్లనే ప్రమాదంలో ప్రభుత్వ ఉపాధ్యాయురాలు జమినాబేగం మరణించిందని గ్రామస్తులు ఆరోపించారు. ఆయా కార్యక్రమాల్లో యాదాద్రి భువనగిరి జిల్లా విద్యార్థుల, రాజకీయ పార్టీ అధ్యక్షుడు ఎడ్ల నరేష్, మండల అధ్యక్షుడు మల్లెబోయిన మహేష్, వినయ్‌కుమార్, గడపాక నవీన్, పాలడుగు గ్రామ మాజీ సర్పంచ్ మరిపల్లి యాదయ్య, బాలరాజు, మధుసూదన్, కొంపెల్లి రోశయ్య, వెంకట్‌రెడ్డి, సతీష్ పాల్గొన్నారు.


పాలడుగులో ధర్నా చేస్తున్న విద్యార్థులు

మహిళా టీచర్‌ను ఢీకొట్టిన వాహనం గుర్తింపు

అడ్డగూడూరు : చౌల్లరామారం శివారులో టీచర్ స్కూటీని ఢీకొట్టిన వాహనాన్ని గుర్తించినట్లు బుధవారం ఎస్‌ఐ నాగరాజు తెలిపారు. అడ్డగూడూరు మండల కేంద్రంలోని మంగమ్మగూడెం గ్రామస్తుడు బైరెడ్డి మచ్చాస్‌రెడ్డికి చెందిన టిప్పర్ కంకర లోడుతో పాటిమట్ల నుంచి తిరుమలగిరి వైపు వెళ్తుండగా చౌల్లరామారం శివారులో టీచర్ నడుపుతున్న స్కూటీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో టీచర్ మృతి చెందింది. సీసీ కెమెరా ఫుటేజ్ ఆధారంగా గుర్తించి డ్రైవర్, ఓనర్ అయిన మచ్చాస్‌రెడ్డిని అదుపులోకి తీసుకుని, టిప్పర్‌ను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్ తరలించామన్నారు. మచ్చాస్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

కనులపండువగా వేణుగోపాలస్వామి కల్యాణం

- హాజరైన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి


శ్రీవారిజాల వేణుగోపాలస్వామి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

నార్కట్‌పల్లి : మండల పరిధిలోని గోపాలాయపల్లి గ్రామ సమీపంలో కొలువైన ఉన్న శ్రీవారిజాల వేణుగోపాలస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారి కల్యాణోత్సవాన్ని ఆలయ అర్చకులు వేదమంత్రాలతో వైభవంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ముందుగా ఎదుర్కోళ్లు నిర్వహించి ఉత్సవమూర్తులను కల్యాణ వేదిక వద్దకు తీసుకొచ్చారు. తిరు కల్యాణంలో భాగంగా మంత్రి వెంకట్‌రెడ్డి స్వయంగా స్వామివారి పల్లకి మోశారు. విశ్వసేన అరాధాన పూజకు కల్యాణతంతును అర్చకులు ప్రారంభించి పుణ్యవచన, కంకణధారణ, మంత్రోచ్చారణల నడుమ కల్యాణం నిర్వహించారు. కల్యాణంలో దేవాలయ అనువంశిక చైర్మన్ కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి దంపతులు స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించారు. అదే విధంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. వారికి దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో సన్మానం చేశారు. వేడుకలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ప్రధాన సమాచార కమిషనర్ డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యే వేముల వీరేశం సతీమణి వేముల పుష్ప పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారి కల్యాణాన్ని తిలకించారు. అనంతరం భక్తులకు అన్నదాన చేశారు. సీఐలు నాగరాజు, వెంకటయ్య పర్యవేక్షణలో ఎస్‌ఐ క్రాంతికుమార్ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. కల్యాణోత్సవంతో అర్చకులు ప్రాతాపురం మచ్చగిరిచార్యులు, కారంపుడి కృష్ణమాచార్యులు, ప్రాతాపురం వెంకటేశ్వరచార్యులు, హేమంత్ చార్యులు, వేణుగోపాలచార్యులు, శుభంశర్మ, అభిషేక్‌దేవేశర్మ, ఉషల్‌దూవేశర్మ, నల్లగొండ ఉప రవాణా కమిషనర్ వాణి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బత్తుల ఉషయ్య, దూదిమెట్ల సత్తయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ నర్ర మోహన్‌రెడ్డి, వైస్‌చైర్మన్ ఐతరాజు యాదయ్య, కంచర్లపల్లి పవన్‌కుమార్, దార యాదయ్య, గోసుల భద్రాచలం, పాశం శ్రీనివాస్‌రెడ్డి, సట్టు సత్తయ్య, భారత్, యాట సైదులు, ప్రజ్ఞాపురం సత్తి, గణేష్, నర్ర నర్సిరెడ్డి, సంపత్, మచ్చ లింగస్వామి, ఈశ్వరయ్య, వేణు పాల్గొన్నారు.


తాళిబొట్టు చూపుతున్న అర్చకులు


పూజల్లో పాల్గొన్న డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు